# కేజీబీవీలో.. పడకేసిన.. విద్యా ప్రమాణాలు..!

(మొదటి పేజీ తరువాయి ) :
ఒకటి ఒక ఉద్యోగి ఫినాయిల్ తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించడం. మరి అక్కడ అధికారుల వేధింపులే కారణమా... లేక ఆధిపత్య పోరు కారణమా... బయటికి రాలేదు. మరో కేజీబీవీలో ఒక విద్యార్థిని రాత్రి అదృశ్యమైంది. ఉదయం తిరిగి వచ్చింది. ప్రేమ వ్యవహారం కారణమని అధికారులు చెప్పారు. అక్కడి వ్యవహారం చాలా కాలంగా నడుస్తున్నప్పటికీ అక్కడి నిర్వాహకులకు ఆ విషయం తెలియదని చెప్తున్నారు. అంతకుమించి అలాంటి విద్యార్థులు అక్కడక్కడ ఉంటారు వారిని ఎలా కంట్రోల్ చేయగలమని ఎదురు ప్రశ్నించడం ఎస్ఎస్ఏ అధికారులకే చెల్లింది.

పదవ తరగతి ఫలితాల విషయానికి వస్తే ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో 26 కేజీబీవీలు ఉన్నాయి. అందులో 929 మంది విద్యార్థులు పదవతరగతి పరీక్షలు రాశారు అందులో కేవలం 550 మంది మాత్రమే ఉత్తీర్ణులు అవడంతో 59% మాత్రమే వచ్చింది. సాధారణంగా రెసిడెన్షియల్ పాఠశాలలో ఉత్తీర్ణత 80శాతం పైగా ఉంటుంది. కానీ ఈ దఫా ఆ పర్సంటేజ్ పూర్తిగా పడిపోయింది. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలల పర్సంటేజీలు ఇలా ఉన్నాయి. బీసీ వెల్ఫేర్ 95.28 శాతం, రెసిడెన్షియల్ స్కూల్స్ 97.58 శాతం, సోషల్ వెల్ఫేర్ 83.7 శాతం, ఏపీ మోడల్ స్కూల్స్ 74.79 శాతం, ఎస్టి ఆశ్రమ స్కూల్స్ 70.13 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ 69.23 శాతం, కేజీబీవీ 59.2 శాతం, ఇలా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల ఫలితాల వరుసలో కేజీబీవీ చివరి స్థానంలో ఉంది. ఇంకో విషయం ఏంటంటే కేజీబీవీ నుండి మొత్తం 929 మంది పదో తరగతి పరీక్ష రాయగా అందులో కేవలం 21 మంది మాత్రమే 500 మార్కులు దాటారు. ఇక టాప్ స్కోర్‌లో నిలిచిన విద్యార్థులు కేజీబీవీ లలో అస్సలు లేరు. ఫలితాల పరంగా పరిశీలిస్తే కేజీబీవీలలో హోలగుంద పాఠశాల 18.92%తో కేజీబీవీ పరువు తీయగా... తర్వాతి స్థానాలలో కోసగి 44.83 శాతం, మంత్రాలయం 45.65 శాతం, బెలగల్ 44.12 శాతం, ఆలూరు 41.18 శాతం, చిప్పగిరి 44.12 శాతం, పత్తికొండ 45.71%లతో 50 శాతం రిజల్ట్స్ కూడా దాటలేకపోయాయి.

ఈ దఫా 90 శాతం ఫలితాలు పైబడి కేవలం ఒకే ఒక్క పాఠశాల ఎమ్మిగనూరు మాత్రమే ఉండగా.. 80 శాతం పైబడిన ఫలితాల్లో ఒక్క పాఠశాల కూడా లేదు. 70% ఫలితాలు పైబడి ఐదు పాఠశాలలున్నాయి. 60 శాతం ఫలితాలు పైబడి రెండు పాఠశాలలు ఉన్నాయి. ఇక 50% ఫలితాలు పైబడి ఆరు పాఠశాలలున్నాయి. మిగిలినవి 50 శాతంలోపే ఫలితాలు సాధించాయి. ఇలా ఈ ఏడాది ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూరిబా గాంధీ బాలికా పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాలు పూర్తిగా నిరాశ కల్పించాయి. గత ఏడాది ఫలితాలు బాగా ఉన్నప్పటికీ ఈ ఏడాది ఫలితాలు తగ్గిపోవడానికి కారణాలు నిర్వహణ లోపమేనని తెలుస్తోంది. ఏది ఏమైనా సమస్యలు ప్రక్షాళన చేసి కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినిల భవిష్యత్తును బాగు చేయాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం పై ఉంది.

వివరణ... కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాలు తగ్గడంపై జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాములన్ను ప్రభాతవార్త వివరణ కోరగా... కేజీబీవిలలో పదవ తరగతి ఫలితాలు తక్కువ వచ్చిన విషయం వాస్తవమే అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుండి విద్యార్థినిలు విద్యాలయాల్లోనే ఉంటారని.. అలాంటప్పుడు వారిని అన్ని విధాలుగా చదువులో అగ్రస్థానానికి తేవాల్సిన బాధ్యత ఉందన్నారు. అయితే ఈ సంవత్సరం ఫలితాలు తక్కువగా రావడం బాధాకరమన్నారు. కాగా ఆయా పాఠశాలల ఫలితాలను పరిశీలించి.. వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ఫలితాలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటామని డీఈఓ శ్యాముల్ వివరించారు

# వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కఠినంగా శిక్షించాలి



**కర్నూలు న్యూసిటి, మే 22, ప్రభాతవార్త:** పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌ల్లో చేసిన దౌర్జన్యం మనమంతా కళ్ళారా చూశామని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర పేర్కొన్నారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాస్వామ్యంపై ఏమాత్రం నమ్మకం ఉనా న్న ఇలాంటి వ్యక్తిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, ఇలాంటి రామకృష్ణారెడ్డిలు పార్టీలో మరెందరో ఉన్నారని ఇలాంటి వారు మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మన రాష్ట్ర పరిస్థితి ఏరకంగా ఉంటుందో ఆలోచించాలన్నారు. ఇలాంటి వారిపై కఠినాతికఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నవధాన్యాల సాగు పుడమికి బాగు..



**ఆస్పరి, మే 22, ప్రభాతవార్త**

ఒకే రకమైన పంట కాకుండ ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో నవధాన్యాలతో పలు రకాల పంటలు వేయడం వల్ల రైతులకు ఆదాయంతో పాటు నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్ చంద్రశేఖర్, కన్సల్టెంట్ రాజేశ్వరిలు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నగరూరు గ్రామంలో 24రకాల విత్తనాలకు బీజామృతం వేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రకంగా వేసుకోవడం వల్ల పంటలు వైవిధ్యం ఏర్పడుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి తెలియజేశారు. సిబ్బంది అందరు ప్రకృతి వ్యవసాయంపై రైతులందరికి పూర్తిస్థాయి అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎక్కువ రకాల పంటలు వేసుకుని ఆదాయంతో పాటు నేలలో జీవ పదార్థం, భూసారం పెరుగుతుందన్నారు. మొక్కలు పెరగడానికి అవసరమైన పోషకాలని నేలలో ఉంటాయని రైతులకు అర్థమయ్యే విధంగా సిబ్బంది తెలియజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పండించినటువంటి ఆహారం తినడం వల్ల ప్రజలందరు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందరు వారికి కేటాయించిన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలన్నారు. పంటలకు వచ్చే పురుగు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించి వాటి నివారణ కొరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చేయాల్సిన, చేస్తున్నటువంటి కషాయాలు, ద్రావణాలపై అవగాహన కల్పించాలన్నారు. రసాయన పురుగు మందులను వినియోగించడం ద్వారా వాతావరణం కలుషితమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాచురల్ ఫామింగ్ అసోసియేట్ మల్లికార్జున, ఎన్ఎఫ్-ఎంటి నగేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వీరేష్, నాగార్జున, నాగభూషణం, రంగముని, నరసింహులు, భూలక్ష్మి, జగదాముడు, లక్ష్మీకాంత్, పులిశేఖర్ తదితరులున్నారు.

# తెలుగు రాష్ట్రాల సరిహద్దులో... వన్యప్రానుల సంరక్షణపై ప్రత్యేక చొరవ..!

(మొదటి పేజీ తరువాయి ) :
ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిసింది.



**ఈ విషయంపై ఆత్మకూరు డిప్యూటి డైరెక్టర్ సాయిబాబను ప్రభాతవార్త వివరణ కోరగా...** శ్రీశైలం నుంచి కృష్ణనది మీదుగా ప్రతి రోజు పర్యవేక్షణ చేసేందుకు శ్రీశైలం రేంజ్ నుంచి బోటింగ్ రిజర్వు స్టాప్‌తో కలసి ప్రతి రోజు వెళ్లే విదంగా చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా నెలలో ఒక్కసారి ఇలాంటి పర్యవేక్షణ సిబ్బంది తప్పని సరిగ్గా చేయాలని గుర్తు చేశారు. శ్రీశైలం పర్యటక కేంద్రంగా సఫారి క్రింద అదనంగా మరో రెండు ప్రత్యేక వాహనాలు మంజూరు చేశామని వివరించారు. గతంలో డీజలతో నడిచేవాహనాలను నిషేదం చేసి టెక్నాలాజి మారడంతో పెట్రోలుతో నడిచే వాహనాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. నాగులూటికి మరో రెండు సఫారి వాహనాలు మంజూరు చేశామని వివరించారు. ముఖ్యంగా పెద్దపులి సంరక్షణతో పాటు కృష్ణనది తీరంలో నిషేదమైన ప్రాంతాలలో మత్సకారులు చేపల వేట కొనసాగిస్తే అటవీహక్కు చట్టాల క్రింద కేసులు నమోదు చేయకతప్పదని హెచ్చరించారు.

# "మానవతా సేవలో మమేకం కావాలి"

-హెచ్ఐవి పాజిటివ్ చిన్నారులకు వితరణ




**నంద్యాల విద్య, మే 22, ప్రభాతవార్త:** స్థానిక శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో బుధవారం హెచ్ఐవి పాజిటివ్ బాధిత చిన్నారులకు న్యూట్రిషన్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం ఉచితంగా నిర్వహించారు. రామకృష్ణ కళాశాల చైర్మన్ డా.జి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డా.ఉమామహేశ్వర్‌రావు రిటైర్డు ఐఏఎస్ అధికారి, విద్యాభారతి సంస్థల కార్యదర్శి రావుల సూర్యనారాయణలు పాల్గొన్నారు. ఈసందర్భంగా డా.ఉమా మహేశ్వర్‌రావు మాట్లాడుతూ సామాజిక సేవలో ప్రముఖులు ముఖ్యపాత్ర పోషించినప్పుడు ప్రజల్లో సేవా తత్పరత పెంపొందించిన వారం అవుతాం. రామకృష్ణారెడ్డి ఎంతో సేవా తత్పరతతో హెచ్ఐవి పాజిటివ్ చిన్నారి బాధితులకు దాదాపు 50 మందికి ఉచితంగా మందులు, పౌష్టికాహార పదార్థాలు అందజేయడం గొప్ప విషయం అన్నారు. ప్రతినెల ఈకార్యక్రమం కొనసాగించడం ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికి ముందుకు వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు నుండి క్రమం తప్పకుండా ప్రతినెల 50 మంది హెచ్ఐవి బాధిత చిన్నారులకు రూ.25 వేలు విలువచేసే మంచిమందులతో పాటు పౌష్టికాహారం అందించడం వారి ఔన్నత్యానికి సహకార గుణానికి మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. డా.జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరిలో దైవగుణం మనలో ఇలాంటి సహాయ సహకారాలు చేసినప్పుడు ఎంతో ఆత్మసంతృప్తి కలుగుతుందని భగవంతుడి పట్ల ఆరాధన భావం రెట్టింపు అవుతుందని మానవసేవయే మాధవసేవ అని రామకృష్ణ పరమహంస చెప్పిన విషయాలు ఎప్పుడు మననం చేసుకుంటూ ఉంటానని అన్నారు. సమాజం పట్ల, దేశం పట్ల గౌరవం ఉన్నప్పుడు మనం ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఎప్పుడు ముందుకు వస్తామని హెచ్ఐవి పాజిటివ్ బాధిత చిన్నారులు వారికి తెలియకుండానే హైచ్ఐవి వ్యాధికి గురయ్యారని వారు ఎక్కడ వివక్షకు లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో అందరితో పాటు బాగ చదువుకొని సమయానికి మందులు వేసుకుంటు మంచి పౌష్టికాహారం అందినప్పుడు వారు కూడ సమాజంలో గొప్పవ్యక్తులుగా ఎదగడానికి వారి జీవిత కాలం పెంచినవారం అవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఐవి పాజిటివ్ బాధిత చిన్నారుల తల్లిద ండ్రులకు మందులు పౌష్టికాహారం సరుకులు అందజేశారు. ఈకార్యక్రమంలో వైఆర్జీ కో-ఆర్డినేటర్ ప్రసాద్, హెచ్ఐవి పాజిటివ్ నెట్‌వర్కు ప్రెసిడెంట్ బి సుధారాణి, వైఆర్జీకేర్ ప్రాజెక్టు సభ్యులు పి సుజాత, నాగమణి, ఆదిలక్ష్మీ, కళాశాల అధ్యాపకులు, హెచ్ఐవి బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మండుతున్న మటన్, చికెన్ ధరలు..!

## - చికెన్ ధరలకు రెక్కలు
## - సామాన్యుడికి అందుబాటులోలేని చికెన్, మటన్ ధరలు





**బనగానపల్లె, మే22, ప్రభాతవార్త:**
బనగానపల్లెలో మటన్, చికెన్ ధరలు మండిపోతు న్నాయి. కిలో మటన్ మార్కెట్‌లో రూ.800 ఉంది. సామాన్యుడికి అందుబాటులో లేని విధంగా మటన్, చికెన్ ధరలు మండిపోతు న్నాయి. బనగానపల్లెలో ముస్లిం మైనార్టీల పాపులేషన్ ఎక్కువ. హిందువులు కూడా మటన్, చికెన్‌లను వాడడంలో ఎక్కువగానే కనిపిస్తారు. పైగా పండుగల సమయాలలో కూడా ఇలా అధిక రేట్లతో మాంసహారాలను అమ్మడం పరిపాటిగా మారింది. ప్రతి రోజు మటన్, చికెన్ తినేవారి సంఖ్య బనగానపల్లెలో ఎక్కువ. ఇదే అదునుగా చేసుకుని బనగానపల్లెలో చికెన్ కిలో ధర రూ.280లు బోర్డులు పెట్టి అమ్ముతు న్నారు. సామాన్యుడు కొనలేని, తినలేని విధంగా ఉండడంతో నానా యాతన పడుతున్నారు. మటన్ కొనాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాంసం ప్రియులకు ధరల పెరుగుదల ఏమాత్రం రుచించడంలేదు. ముక్కలేనిదే ముద్దదిగని వాళ్ల పరిస్థితి ఇంకా చెప్పనవసరంలేదు. ప్రస్తుతం కొన్ని రోజుల నుండి ధర పెరగడంతో వినియోగదారులకు శాపంగా మారింది. అలాగే నిన్న, మొన్నటి వరకు చికెన్ రూ.240ల వరకు ఉండేది. సామాన్యుడు చిరు వ్యాపారస్తులు అధిక ధరల పై మండిపడుతు న్నారు. వ్యాపారస్తులందరూ సిండికేట్‌గా మారి ధరలు పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇంతవరకు గ్రామ పంచాయతీ అధికారులుకాని, పోలీస్ అధికారులుకాని, ఇతర సంబంధిత శాఖల అధికారులుకాని అధిక ధరల పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు సంబంధిత అధికారుల పై విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు గొప్పలు చెప్పు కోవడం తప్ప సామాన్యుడికి అందు బాటులో ఉండే విధంగా మాంసం ధరలు లేకపోవడం మరింత విచారకరం. ఇదిలా ఉండగా మటన్ మార్కెట్‌లో కొన్ని జీవాలు రోగాలకు గురి అయినటువంటివి, మరికొన్ని ప్రాణం పోయినవి కూడా ఎవరికి తెలియకుండా, చూపకుండా కట్‌చేసి అమ్ముతున్నట్లు కూడా సమాచారం. ఇలాంటి సంఘటన గతంలో బహిర్గతమైనట్లు పలువురు పేర్కొంటున్నారు. అయితే మటన్ మార్కెట్‌లో మంచి జీవాలను గుర్తించి గ్రామ పంచాయతీ ముద్ర వేసిన వాటిని మాత్రమే కోసి అమ్మాలి. అయితే కొందరు నిబంధనలకు విరుద్ధంగా మాంస విక్రయానికి పనికిరాని వాటిని కూడా కోసి అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. వీటి పై గ్రామ పంచాయతీ అధికారులు కూడా నిఘా ఉంచకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారి మటన్ అమ్మబోయే జీవాల పై ముద్రవేసినవి మాత్రమే అమ్ము కోవాలి. అయితే సదరు ముద్రవేసే ఉద్యోగికి అవసరమైన మటన్‌ను లేక కొంత డబ్బును అందిస్తున్నట్లు కూడా సమాచారం. ఇప్పటికైనా బనగానపల్లె పోలీస్ అధికారులు నిఘా ఉంచడంతోపాటు పెరిగిన ధరలను కూడా నియంత్రించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# శ్రీగిరిలో సాంస్కృతిక కార్యక్రమాలు



**శ్రీశైలంప్రాజెక్టు, మే22, ప్రభాతవార్త**

శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా(నిత్య కళారాధన కార్యక్రమంలో బాగంగా)బుదువారంనాడు స్పందన డ్యాన్సు అకాడమీ మరియు కళారాధన కూచిపూడి డ్యాన్సు అకాడమీ, అమీర్‌పేట, రంగారెడ్డి జిల్లా వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. కాగా ఆలయ దక్షిణ మాడవీదిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహాగణపతిం, గణేశకౌత్వం, నటేశకౌత్వం, మూషికవాహన, మనసాస్మరామి, చంద్రచూడ శివశంకరపార్వతీ తదితర గీతాలకు కిరణ్మయి, మైధిలి, ప్రతీక, ధాత్రి, గాయిత్రి, వైష్ణవి తదితరులు నృత్యప్రదర్శన చేసారు. ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజు సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తి రంజిని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాదన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

# జ్వాలవీరభద్రస్వామివారికి విశేష పూజలు

**శ్రీశైలంప్రాజెక్టు, మే22, ప్రభాతవార్త**



లోకకలా్యణం కోసం దేవస్థానం బుదువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామివారికి (జ్వాలవీరభద్రస్వామివారికి) విశేష పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయప్రాంగణంలోని మల్లికార్జునస్వామివారికి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికా గుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలాముకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు. శిల్పాశాస్త్ర పరిబాషలో ఈ స్వామికి అఘోరవీరభ్ద్రమూర్తి అని పేరు కూడా ఉంది. కాగా ప్రతి బుదువారం ప్రదోషకాలంలో విశేష అభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణ పతిపూజను నిర్వహించబడింది. తరువాత వీరభద్రస్వామికి పంచామృ తాలతోనూ, ఫలు రకాల ఫలోదాకాలతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్దజలంతోనూ విశేష అభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడింది.

# శ్రీసాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం

**శ్రీశైలంప్రాజెక్టు, మే22, ప్రభాతవార్త**



లోక కల్యాణం కోసం దేవస్థానం బుదువారంనాడు ఉదయం సాక్షిగణపతిస్వామివారికి సంకటహరతి చవితిరోజులు మరియు పౌర్ణమి రోజులలో ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించ బడుతున్నాయి. కాగా సా క్షిగణపతిస్వామివారికి పంచామృ తాలతోనూ, ఫలుఫలోదాకాలతోనూ, హరిద్రోదకం, శుద్దజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పర్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. కాగా వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అదే విధంగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. కాగా చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# వీడిన మిస్టరీ..!

## : 24 గంటల్లో మహిళ జంట హత్య కేసు చేదన
## : 48 గంటల్లో నిందితుడిని రిమాండ్

**కర్నూలు రూరల్ మే22, ప్రభాతవార్త:** గత మూడు రోజుల క్రితం నగర శివారులో నీ నగరవనం చెరువులో తేలిన జంట మహిళ హత్య కేసును కర్నూలు జిల్లా పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. కేసులో ఉన్న చిక్కుముడిని విప్పి మిస్టరీని చేదించారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని 48 గంటల్లో రిమాండ్కు పంపించిన ఘనత పోలీసులకు దక్కింది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ప్రజలు హర్షిస్తున్నారు. ఈ కేసులో కర్నూల్ నగరానికి చెందిన ఎస్ మహబూబ్ బాషా ను నిందితుడిగా గుర్తించి రిమాండ్ కు తరలించారు. ఈ కేసు నగరంలో కలకలం రేపడంతో ఛాలెంజ్ గా తీసుకున్న కర్నూలు రేంజ్ విజయ రావు, కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కర్నూలు అడిషనల్ ఎస్పీ నాగరాజు, కర్నూలు డిఎస్పీ విజయశేఖర్ బాధ్యతలు స్వీకరించి మూడు బృందాలుగా 3 బృందాలుగా కర్నూలు 2 టౌన్, ఫోర్త్ టౌన్, కర్నూలు తాలూకా సిఐలు ఇంతియాజ్ భాష, శంకరయ్య, శ్రీధర్ లు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. వారు అహర్నిశలు కృషి చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును ఛేదించారు. ఇద్దరు మహిళల మృతికి కారణమైన ముద్దాయి అయిన ఆటో డ్రైవరు %ూ%. మహబూబ్ బాష ను 24 గంటల లోపల పట్టుకొని 48 గంటల లోపల రేమండ్ కు తరలించారు.

**మహిళలను చంపింది ఆటోడ్రైవరే :** ఈ మేరకు బుధవారం పోలీస్ శాఖ అధికారులు ఒక ప్రకటనను ఈ కేసుకు సంబంధించి విడుదల చేశారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు మండలము, గార్గేయపురం గ్రామ పొలిమేర లోని నగరవనం సమీపంలో ఉన్న చెరువులో, కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోన కర్నూలు మండలంలోని గార్గేయపురం గ్రామ పొలిమేర లో ఉన్న నగరవనం సమీపంలో ఉన్న చెరువులో ఇద్దరి ఊరు, పేరు, చిరునామా తెలియని మహిళల మృత దేహాలు చెరువు నీటిలో బోర్లాపడి తెలియాడుతుండగా గ్రామ తలారి ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న గ్రామ %ఎ=ూ% వెంటనే సదరు నేర స్థలాన్ని చేరుకొని శవాల ఆచూకీ కొరకు ఘటన పరిసరాలలో, చుట్టుప్రక్కల గ్రామాలలో విచారించి ఎలాంటి సమాచారం తెలియరానందున సదరు విషయంలో విచారించి తగిన చర్య తీసుకొనుటకు గాను కర్నూలు తాలూకా ఇన్స్పెక్టర్ కి పిర్యాదు చేశారు. మృతురాళ్ళు అరుణ, జానకి లది తెలంగాణ రాష్ట్రం, మహబూబ్ నగర్ జిల్లా అని, వారు వేశ్య వృత్తి నిమిత్తం కర్నూలుకు కొన్ని సంవతారాల కిందట వలస వచ్చి కర్నూలును కేంద్రంగా చేసుకొని వారి వేశ్య వృత్తి కొనసాగించేవారని తెలిపారు. ఈ క్రమం లో వారికి కర్నూలు నగరానికి చెందిన ముద్దాయి అయిన ఆటో డ్రైవరు మహబూబ్ బాషా పరిచయమైనాడని, గతంలో ఆటో డ్రైవరుకు జానకి కి వచ్చిన మనస్పర్థల వల్ల జానకీ ఆటో డ్రైవరు ను వేరే వ్యక్తుల చేత కొట్టించినదని అది మనసులో పెట్టుకొని ముద్దాయి ఆటో డ్రైవరు మహబూబ్ బాష జానకి పై కక్ష పెంచుకొన్నాడని తెలియజేశారు. ఎలాగైనా జానకి మీద ప్రతీకారం తీర్చుకోవాలని అవకాశం కోసం ఎదురు చూస్తున్న క్రమంలో ఈ నెల18వ తేదీన జానకి, అరుణ లు తమ బట్టలు ఉతుక్కొవడానికి గార్గేయపురం గ్రామ శివారులోని నగరవనం సమీపంలో ఉన్న చెరువు వద్దకు ముద్దాయి ఆటోలో వెళ్ళి బట్టలను ఉతుక్కొనుచుండగా అవకాశం కోసం ఎదురు చూస్తున్న ముద్దాయి జానకి ని వెనక నుండి చేరువులోనికి దొబ్బినాడని ఈ క్రమం లో ముద్దాయి కూడా నీటిలో పడిపోగా పక్కన ఉన్న అరుణ ముద్దాయిని రక్షించబోయి ఆమె కూడ నీటిలో పడిపోయినదని, ముద్దాయి గట్టుకు దగ్గరలో ఉన్నందున నీటినుండి బయటకు వచ్చినాడని పేర్కొన్నారు. అప్పటినుండి పోలీసులకు కనపడకుండా తిరుగుతుండగా పోలీస్ వారు అతని కనిపెట్టి పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపామని తెలియజేశారు. ముద్దాయిని అత్యంత తక్కువ సమయంలో అరెస్టు చేసి రిమాండ్ పంపడం పట్ల ప్రజలు పోలీసులను హర్షిస్తున్నారు.

# కలుగోట్లలో పోలీసుల సోదాలు

- రాజకీయనాయకుల ఇళ్లల్లో తనిఖీలు...



**వెల్దుర్తి, మే22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో బుధవారం వెల్దుర్తి సర్కిల్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు. గ్రామంలోని రాజకీయనాయకుల, అనుమానస్పద వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్సై పోలీసు సిబ్బందితో గ్రామంలోని పురవీధుల్లో కవాతు నిర్వహించారు. గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యాయని ఎవరు కక్ష్యలకు పోకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# డాక్టర్ ఎల్లంటి శోభన్‌బాబు రచించిన పుస్తకావిస్కరణ



**శ్రీశైలంప్రాజెక్టు, మే22, ప్రభాతవార్త**

చరిత్ర, సంస్కృతి, పురవస్తు శాస్త్ర పీఠం శ్రీశైల ప్రాంగణంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎల్లంటి శోభన్‌బాబు రచించిన స్వాతంత్ర సమరయోదులు-చిత్తూరు జిల్లా, డైనమిక్ ఆఫ్ ఇరిగేషన్ ఆండ్ ది కాకాతీయస్ అను గ్రంధాలను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లి కే ంద్ర కార్యలయంలో ఉపాధ్యక్షులు అచార్య తంగెడ కిషన్‌రావు మరియు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ అచార్య భట్టు రమేష్ చేతుల మీదుగా బుదువాంనాడు అవిస్కరించడం జరిగింది. ఉపాధ్యాక్షులు అచార్య తంగెడ కిషన్‌రావు భాద్యతలు చేపట్టి మూడు సంవత్సరములు విజయవంతం చేసినందుకు అభినందన సభను ఏర్పాటు చేయడం జరిగింది. ఈసందర్బంగా విశ్వవిద్యాలయం వివిధ పీఠాధిపతులు-శాఖధిపతులతో పాటు వివిధ పీఠాలైన వరంగల్, శ్రీశైలం, కూచిపూడి, రాజమండ్రి పీఠాల నుండి బోధన, బోధనేతర సిబ్బంది కూడా పాల్గోని విశ్వవిద్యాలయ ఉపాధ్యాక్షులు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో(ఆఫీర్ ఆన్‌స్పెషల్ డ్యూటీ ఆంధ్ర పీఠాల ఇంచార్జ్)ఆచార్య వి, నిరీక్షణబాబు, ఆచార్య ఎం.శ్రీనివాసరావు(చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్ర పీఠం శ్రీశైలం)ఆచార్య ఏం.వెంకటేశ్వరరావు(ఉసా ్మనీయా చరిత్రశాఖ), ఆచార్య శ్రీనాధ్(కాకాతీయ విశ్వవిద్యాలయం), ఆచార్య జి.వెంకటరామయ్య(తెలుగు విశ్వవిద్యాలయం)తదితరులు పాల్గోన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు డా.ఇ.శోభన్‌బాబు అందరికి కృతజ్ఞతాభి వందనాలు తెలిపారు.

# పేట రామా, లచ్చప్ప గురువుల 174వ ఆరాధన మహోత్సవం



**నందవరం, మే 22, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కనకవీడు పేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ గురుదత్తాత్రేయ సాంప్రదాయ పీఠస్తులైన రామ లచ్చప్పస్వాములు 174వ ఆరాధన మహోత్సవం వైభవంగా జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. పుణ్యక్షేత్రం నందు ప్రసిద్ధిచెందిన మహా మహిమలు గలవారు రామా, లచ్చప్ప స్వాములన్నారు. గురువారం స్వస్తిశ్రీక్రోధి నామ సం. వైశాఖ పౌర్ణమి 23న ఉదయం 10 గంటలకు భజంత్రీల భక్తిశ్రద్ధలతో పందిరవేయుట ఆరుపూజ కార్యక్రమం జరుగునని పాడ్యమి 24న శుక్రవారం ఉదయం 8గంటల నుండి శ్రీగణపతి పూజ పుణ్యాహవచనం, మాతృరాపూజ రుద్రాభిషేకం, ఆకుపూజ, సమస్త దేవతపూజలు, సద్గురు రామప్ప లచ్చప్పస్వామివార్లకు పంచామృతాభిషేకం అష్టోత్తర పూజలు నైవేద్యం మంగళహారతి సాయంత్రం 4.30 గంటలకు రథహోమం, సాయంత్రం 5.30 గంటలకు శ్రీసద్గురు రామప్పస్వామి లచ్చప్పస్వామి వారి మహారథోత్సవం జరుగునన్నారు. రాత్రి 8 గంటల నుండి అఖండ భజన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తాదులందరు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మంగళహారతులు తీసుకొని స్వామివారి కృపకటాక్షములకు పాత్రులగుదురని గ్రామస్థులు కోరారు. ఈకార్యక్రమాలన్ని గ్రామపెద్దలు, ప్రజల సహాయ సహకారాలతో జరుగునని కనకవీడు పేట భజన భక్తబృందం తెలియపరిచారు.

# రైతులకు బిల్లులు ఇవ్వకపోతే సీజ్ చేస్తాం

**ప్యాపిలి మే22(ప్రభాతవార్త):** రైతులకు నాణ్యమైన ఎరువులను, మందులను ఇవ్వాలని వ్యవసాయ అధికారి రాజేష్ కోరారు. ప్యాపిలి పట్టణంలోని ఫర్టిలైజర్ షాపులను బుధవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను, రసాయన మందులను కొనుగోలు చేసిన రైతులకు మ్యాన్‌వెల్ బిల్లులకు ఇవ్వకూడదని, ప్రింట్ అవుట్ బిల్లులు ఖచ్చితంగా ఇవ్వాలని, బిల్లులు ఇవ్వని షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. షాపుల వద్ద ఎరువుల ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు గాను వేరుశెనగ విత్తనాలను పంపిణి చేస్తున్నామని తెలిపారు. కదిరి 6 రకం, కదిరి లేపాక్షి1812, టిసిజిఎస్ రకాల వేరుశెనగ విత్తనాలను సబ్సిడిపై రైతులకు పంపిణి చేస్తామన్నారు. కదిరి 6 రకం, టిసిజిఎస్ రకం క్వింటం ధరల రూ9500లకు గాను 40శాతం సబ్సిడి కింద 3800 రూపాయలు పోగా, రైతు వాటా కింద 5700 రూపాయలను చెలి ంచాలని వివరించారు. 30 కేజిల బ్యాగు దర 1710 రూపాయల ప్రకారం రెండు బ్యాగులు రూ3420లు, మూడు బ్యాగులు రూ5130లకు రైతులకు ఇస్తామని పేర్కొన్నారు. కదిరి లేపాక్షి రకం వేరుశెనగ విత్తనం క్వింటం రూ8700లు ఉండగా 40శాతం సబ్సిడి కింద రూ3480లు పోను రైతులు రూ5220లు చెల్లించాలని కోరారు. 30 కేజిల బ్యాగు ధర రూ1566లు కాగా రెండు బ్యాగులు 3132రూపాయలు, మూడు బ్యాగ్‌లకు రూ4698లను రైతులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.



# బజరంగ్ దళ్ శౌర్య ప్రశిక్షణ వర్గను విజయవంతం చేయాలి



**కర్నూలు విద్య, మే 22, ప్రభాతవార్త:** కర్నూలులో 7 రోజుల పాటు జరిగే బజరంగ్ దళ్ రాష్ట్ర శౌర్య ప్రశిక్షణ వర్గను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు పిలుపు నిచ్చారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో జరిగే శిక్షణా తరగతులు ఈసంవత్సరం కర్నూలు నగరం లో జరుగుతున్నాయని తెలుపుతూ కర్నూలులో జరగబోయే బజరంగ్ దళ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల స్థలాల పరిశీలన సందర్భంగా జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన రాష్ట్రకార్యదర్శి కాకర్ల రాముడు మాట్లాడుతూ వివిధ జిల్లాల నుండి విచ్చేస్తున్నటువంటి బజరంగ్ దళ్ కార్యకర్తలకు శారీరక ధృడత్వం కోసం మంచి శిక్షణ ఉంటుందని దేశం కోసం, ధర్మం కోసం సమయం ఇచ్చి పనిచేసే దేశభక్తులుగా తయారుచేసి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యేలా శిక్షణ ఇవ్వాలని బజరంగ్ దళ్ రాష్ట్రస్థాయి నాయకులకు శిక్షకులకు పిలుపునిచ్చారు. బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మే 26 నుంచి జూన్ 2వ తేది వరకు కర్నూలులో బజరంగ్ దళ్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు జరుగుతున్నాయని శిక్షణ తరగతులకు రాష్ట్రం నుండి వివిధ జిల్లాల నుండి బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొంటున్నారని ఈశిక్షణ తరగతులకు విశ్వహిందూ పరిషత్ జాతీయ నాయకులు, క్షేత్ర నాయకులు, రాష్ట్రనాయకులు పర్యటనకు వస్తున్నారని తెలిపారు. ఈసమావేశంలో బజరంగ్ దళ్ భాగ్యనగర్ క్షేత్ర కన్వీనర్ కుమారస్వామి, బజరంగ్ దళ్ రాష్ట్ర నాయకులు తూముకుంట ప్రతాపరెడ్డి, పోలేపల్లి సందీప్, శశికుమార్, పెంచల్‌రెడ్డి, కమ్మయ్య, నీలినరసింహా, భాను ప్రకాష్, ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.



# మోహమాటం వద్దు....భయం వద్దు.... జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ 14567 -తక్షణ సహాయం

**నంద్యాల విద్య, మే 22, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల హెల్ప్‌లైన్ కోసం 14567 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేసింది. వృద్ధులు మాత్రమే కాదు ఏవరైనను కాల్ చేయవచ్చు. మోహమాటం వద్దు, భయం వద్దు, ప్రతి ఒక్కరు కాల్ చేయండి తక్షణ సహాయాన్ని పొందండి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏవరైనా వృద్ధులకు సంబంధించిన సమస్యల ఫిర్యాదుల పరిష్కారం కోసం ఈ టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేశారు. ప్రతి 60 సంవత్సరాల వయసు దాటిన ప్రతిఒక్కరి దగ్గర ఈ టోల్ ఫ్రీ నంబరు ఉండాల్సిందే. వృద్ధుల హక్కుల కోసం తెలుసుకోవాలన్న, సీనియర్ సిటిజన్ కార్డు పొందాలనుకున్నా, కన్న పిల్లలు దూరంగా ఉండి ఒంటరితనంగా ఫీల్ అవుతున్నా ఈనంబరును కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చు. వృద్దాప్య పెన్షన్ ఎందుకు ఆగిపోయిందో, ఎలా మళ్లీ అప్లయి చేయాలో తెలుసుకోవాలన్న ఈనంబర్‌కు కాల్‌చేయాల్సిందే. వృద్ధులకు సంబంధించిన హాస్పటల్స్, ప్రభుత్వ అఫీసుల అడ్రసులు తెలుసుకోవాలన్న ఈనంబరును సంప్రదించవచ్చు, కొడుకులు, కోడళ్లు మానసికంగా, శారీరకంగా తల్లిదండ్రులను వేధిస్తున్నారంటే ఈనంబరుకు కాల్‌చేస్తే తక్షణసహాయం అందుతుంది. వృద్ధుల కోసం ప్రత్యేక న్యాయస్థానాలు, జిల్లా న్యాయస్థానాల కోసం, వృద్ధుల, తల్లిదండ్రుల చట్టాల కోసం తెలుసుకోవాలన్న ఈనంబరుకుకాల్ చేయండి. వృద్ధాశ్రమాలు, నైట్ షెల్టర్‌లు, కేర్‌గివింగ్ సెంటర్లు, పోలీస్‌స్టేషన్ వివరాలు కావాలంటే ఈనంబరుకు కాల్‌చేయాల్సిందే. జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వివరాలతో పాటు మెంబరుగా జాయిన్‌కావాలన్నా, సీనియర్ సిటిజన్ వేల్పేర్ డిపార్టుమెంటు ఆఫీసు నుంచి ఊతకర్రలు పొందాలన్న, పిల్లలు తమ తమ తల్లిదండ్రుల పోషణ చూడడం లేదన్న ఫిర్యాదు కూడ ఈనంబరుకు చేయాల్సిందే. వృద్ధులకు ఫ్యామిలీ మేనేజ్‌మెంట్ కౌన్సింగ్ కొరకు న్యాయపరమైన సూచనల కొరకు, వృద్ధుల చట్టాలు, ప్రభుత్వ స్కీములు మొదలైన వివరాలు కూడ ఈ జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ నం.14567 కాల్ చేస్తే తక్షణ సహాయం అందుతుందని వెంబడే ఆ శాఖకు సంబంధించిన అధికారులు వారి వద్దకు వచ్చి వారికి న్యాయ సహాయం అందిస్తారని చట్టం తెలుపుతుంది.

# పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**ఆవుకు, మే 22, ప్రభాతవార్త:** ఆవుకు మండలంలోని పాడిరైతులు పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ డాక్టరు భారతీ తెలియజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిరైతులు పశువులను ఇంటివద్ద ఉంచుకొని వెటర్నరీ అసుపత్రిలో తెలియజేస్తే రైతుల ఇంటివద్దకు వెళ్లి ఉచితంగా గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆమె తెలిపారు. వ్యాధి వచ్చిన తరువాత నివారణ చాల ఇబ్బందికరంగా మరియు ఆర్థికంగా నష్టపోవాల్సి ఉంటుందని రైతులను హెచ్చరించారు. నంద్యాల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈవ్యాధి సోకి పశువులు చనిపోవడం జరుగుతుందని ఆమె అన్నారు. పశుపోషకులు పశువైద్యశాల, గ్రామీణ పశువైద్యశాల వద్దకు వచ్చి సంబంధిత సిబ్బందిని కలిసి పశువులకు గొంతువాపు నివారణ టీకాలు ఖచ్చితంగా వేయించాలని ఆమె తెలిపారు.

# నిధులను రైతులకు అందించడంలో ఇబ్బందులు పెట్టకూడదు : ఏపి రైతుసంఘం డిమాండ్




**మంత్రాలయం, మే 22, ప్రభాతవార్త:** రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన పంట ఇనూరెన్స నిధులను రైతులకు అందించడంలో బ్యాంకు అధికారులు ఇబ్బందులు పెట్టకూడదని ఏపి రైతుసంఘం నాయకులు భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్‌బిఐ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేసిన నిధులను రైతుల అప్పులకు పట్టుకుంటున్నట్లు మా దృష్టికి వచ్చి ందన్నారు. ఇప్పటికే వర్షాలు లేక తీవ్రంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవడానికి ఇనూరెన్స నిధులను మంజూరు చేస్తే బ్యాంకు అధికారులు మాత్రం రైతులపై ఏమాత్ర ం కనికరం లేకుండా డబ్బులను ఇవ్వకపోవడం చాలా దారుణమన్నారు. అదేవిధంగా కొంతమంది రైతుల అకౌంట్ నంబర్లు, సర్వే నంబర్లు లాక్ చేయడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున రైతులపై దయవుంచి ఇనూరెన్స నిధులను రైతులకు అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ హనీఫ్, నరసమ్మ, సుంకన్న, రంగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

:-డీలర్లకు ఏడిఏ మహమ్మద్‌ఖాద్రి హెచ్చరిక



**మంత్రాలయం, మే 22, ప్రభాతవార్త:** మండలంలోని విత్తనాల డీలర్లు రైతులకు వివిధ రకాల విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవనిఏడిఏ మహమ్మద్‌ఖాద్రి డీలర్లను హెచ్చరించారు. బుధ వారం మంత్రాలయంలో మండలంలోని విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల స్టాక్‌కు ఇన్‌వాయిస్, సోర్స సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలన్నారు. విక్రయించిన ప్రతి విత్తనానికి రైతులకు బిల్లులు ఇవ్వాల న్నారు. బిల్లులో లాట్ నంబర్, గుడువు తారీఖు తప్పకుండా రాయాలన్నారు. రైతులు సంతకం చేసిన తరువాతే బిల్లులు ఇవ్వాలన్నారు. విత్తనాలను ఎంఆర్‌పి ధరకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టప రమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిషాపులో స్టాక్‌బోర్డు, ధరల పట్టికను అప్‌డేట్ చేయాలన్నారు .లూజు విత్తనాలు విక్రయించవద్దన్నారు. ఎరువులు విక్రయించిన వాటిని డిబిటిలో నమోదు చేయాల న్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి జీరా గణేష్ మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

# జ్ఞానానికి నిలయాలు మన గ్రంథాలయాలు - గ్రంథాలయ అధికారిణి మద్దమ్మ




**పగిడ్యాల, మే 22, ప్రభాతవార్త :** జ్ఞానానికి నిలయాలు మన గ్రంథాలయాలు అనీ గ్రంథాలయ అధికారిణి కె.మద్దమ్మ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అధికారిణి కె.మద్దమ్మ ఆద్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరము నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ విద్యార్థులు రోజు గ్రంథాలయానికివచ్చి జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రంథాలయానికి రావడం వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. " బామ్మ చెప్పిన బంగారు నీతికథ " లోని ముగ్గురు మిత్రుల కథను విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి చదివి వినిపించి విద్యార్థులచేత చదివించారు. క్యారమ్స్, క్రికెట్, ఆటలలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను గ్రంథాలయానికి అలవాటు చేసేందుకు గాను గ్రంథాలయ అధికారిణి కె.మద్దమ్మ విద్యార్థులకు బిస్కెట్లు, చాక్‌లెట్లు అందజేశారు.

# రాయితీ తార్పాళ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

:- కెడిసిఎంఎస్ మేనేజర్ ప్రకాష్‌రెడ్డి



**ఆదోని, మే 22, ప్రభాతవార్త :** రాయితీ తార్పాళ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కెడిసిఎంఎస్ మేనేజర్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ మార్కెట్‌లో నాసిరకం తార్పాళ్లను కొనుగోలు చేసి రైతులు మోసపోయే కంటే ప్రభుత్వం రాయితీ కింద అందచేస్తున్న తార్పాళ్లను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. తార్పాల్ యొక్క పొడవు, వెడల్పు 18బై24 కొలతలు గల నాసిరకం తార్పాళ్లను బజారులో రూ.2300లకు రైతులకు విక్రయించి వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారని అదే ఇక్కడైతే 250జిఎస్‌ఎం, 10కిలోల బరువు గల తార్పాళ్లను అదే కెడిసిఎంఎస్ గోడౌన్ నంబర్ మూడులో రూ.1700లకే ప్రభుత్వం అందిస్తుందన్నారు. మరిన్ని వివరాల కోసం కెడిసిఎంఎస్ మేనేజర్ 6302675433ను రైతులు సంప్రదించాలన్నారు.

# వైసిపి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలి

:- టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి

**పెద్దకడుబూరు, మే 22, ప్రభాతవార్త :** మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దౌర్జన్యంగా పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఈవిఎంలు ధ్వంసం చేసిన మాచర్ల వైసిపి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల్లో వైసిపి అరాచకాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని వైసిపి నాయకులను చూసి సామాన్య ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భయపడుతున్నారని ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లో దౌర్జన్యానికి దిగిన ఎమ్మెల్యేను వైసిపి అధిష్టానం పార్టీ నుండి సస్పెండ్ చేయాలన్నారు. ఇలాంటి వ్యక్తులు మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మన రాష్ట్ర పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఒక్కసారి ఊహించుకుంటేనే భయమేస్తుందన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లాంటి వ్యక్తులు రాష్ట్రంలో చాలామంది ఉన్నారని అలాంటి వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రామకృష్ణారెడ్డిపై తక్షణ చర్యలు చేపట్టకపోతే టిడిపి పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుందని ఆయన హెచ్చరించారు.



# ప్రవేట్ పాఠశాలల అక్రమ ఆడ్మిషన్లు అడ్డుకోండి

- ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున
- మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు



**ఆత్మకూరు మే22, ప్రభాతవార్త:** ప్రవేట్ పాఠశాలలో విద్యార్థుల నుంచి అక్రమ ఆడ్మిషన్లు అడ్డుకునే విదంగా మండల విద్యాశాక అధికారులు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో బుదవారం మండల విద్యాశాక అధికారి 2 సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రవేట్ పాఠశాలల యాజమాన్యం అక్రమ ఆడ్మిషన్ల కోసం ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న పుల్లారెడ్డి, గౌతమి స్కూలుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు పట్టణంలో కార్పోరేట్ తరహాలో ఉన్న ప్రవేట్ పాఠశాల యాజమాన్యల వత్తిలకు గురవుతూ విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతున్న ప్రవేట్ స్కూలు యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల విద్యాశాక అధికారులు అక్రమ ఆడ్మిషన్లపై చర్యలు తీసుకోకపోతే ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి పెద్దఎత్తున్న ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గోన్నారు.

# అనుమతులు లేని విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవు-పత్తికొండ ఏడిఏ విజయ్‌కుమార్



**వెల్దుర్తి, మే22, ప్రభాతవార్త :** అనుమతులు లేని విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎరువులు, సీడ్స్, ఫెస్టీసైడ్స్ దుకాణ దారులకు పత్తికొండ ఏడిఏ విజయ్‌కుమార్ హెచ్చరికలు జారీ చేశారు. వెల్దుర్తి పట్టణంలోని బాలాజీ సీడ్స్, ఫెస్టీసైడ్స్, ధరణి ఫర్టిలైజర్స్, మన గ్రోమోర్ విత్తన దుకాణాలను బుధవారం ఏఓ అక్బర్‌బాషతో కలిసి ఏడిఏ తనిఖీలు నిర్వహించారు. దేకాణంలో స్టాక్ ,బిల్‌బుక్స్, రిజిష్టర్‌లను పరిశీలించారు. పత్తి, కంది, ఆముదం, కూరగాయల విత్తనాలను తనిఖీ చేసి దుకాణదారులకు తగు సూచనలు చేశారు. ప్రతి కొనుగోలుపై రైతులకు తప్పని సరిగా లాట్‌నెంబర్‌తో బిల్లు వేయాలన్నారు. ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు అమ్మకాలు జరుపరాదన్నారు.

**--రాయతీపై విత్తనాన్ని సద్వినియోగం చేసుకోండి...**

మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రాయితీపై వేరుశనగ విత్తనాల పంపిణీ చేస్తున్నామని పత్తికొండ ఏడిఏ విజయ్‌కుమార్, వెల్దుర్తి ఏఓ అక్బర్‌బాషలు తెలిపారు. రాయితీపై వేరుశనగ నమోదు కార్యక్రమాన్ని రైతుభరోసా కేంద్రం వెల్దుర్తి నందు ఏడిఏ పరిశీలించి రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వింటానికి పూర్తి ధర రూ.9,500 రాయితీ రూ.3,800, రైతు వాటా రూ.5,700 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాయతీపై రైతులకు అందించే విత్తనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది ప్రణీత, బందనవాజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కరువు సహాయక చర్యలు చేపట్టాలి



**దేవనకొండ, మే 22, ప్రభాతవార్త :** మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరేశఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కరువు సమస్యలపై తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కరువు రైతాంగాన్ని తీవ్రంగా నష్ట పరిచిందని ఎకరాకు వేలకు వేలు పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్ర నష్టం చవిచూశారన్నారు. అయితే ప్రభుత్వం అరకొర సహాయంతో రైతులకు న్యాయం చేయలేదన్నారు. ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం సరఫరా చేయాలని తద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. అలాగే పూర్తిగా వ్యవసాయ పనుల మీద ఆధారపడుతున్న కూలీలకు 200రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. స్పందించిన తహశీల్దార్ ఈ సమస్యలు ఉన్నతాధికారులకు విన్నవించి పరిష్కారానికి తగు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, రాముడు, నాగన్న, వీరాంజి తదితరులున్నారు.

# రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేసిన ఏవో

**సిబెళగల్, మే22, ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రాలను మండల వ్యవసాయాధికారి జి.మల్లేష్ కుమార్ తనిఖీ చేశారు. బుధవారం ఆయన మండలంలోని పోలకల్, యనగండ్ల, మూడుమాల గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో రైతులకు అనునిత్యం అందుబాటులో ఉండాలని ఆయన సిబ్బందికి సూచించారు. అనంతరం ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కందులు, జీలుగ, వేరుశనగ, వరి విత్తనా లు సబ్సిడీకి ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఎరువులు కూడా ఇవ్వడం జరుగుతుందని విత్తనాలు కావాల్సిన వారు తమ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.



# డెంగ్యూ కేసులను సందర్శించి లార్వా ఆపరేషన్ పరిశీలన

**దేవనకొండ, మే 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కరివేముల గ్రామంలో రాష్ట్ర కీలక జనత వ్యాధుల నియంత్రణ ఆఫీసర్లు బుధవారం డెంగ్యూ కేసులను సందర్శించి వాటికి జరిగిన ఆంటీ లార్వా ఆపరేషన్‌ను పరిశీలించారు. అలాగే గ్రామంలో లార్వా డెన్సిటీ ఎక్కడైనా ఉందేమోనని చాలా చోట్ల పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్సల్టెంట్స్ పరిశీలకులు కొండారెడ్డి, రామచంద్రలు వైద్య సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఫ్రైడే డ్రైడేను కచ్చితంగా నిర్వహించి గ్రామంలో ఇంటింటికి తిరగాలని లార్వా ఉంటే వాటిని వెంటనే తొలగించాలన్నారు. అలాగే జ్వరం కేసులు ఉంటే రక్తపూత నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాలని వారు కోరారు. డెంగ్యూ కేసులు వచ్చిన ఏరియాలో నాలుగు వారాలు కచ్చితంగా ఆంటీ లార్వా ఆపరేషన్ జరగాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా, సూపర్‌వైజర్స్ రంగస్వామి, శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



# ప్రవీణ్ ప్రకాష్‌కు ఓ పౌరుడి బహిరంగ లేఖ

**నంద్యాల విద్య, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు డా.గుంటుపల్లి శ్రీనివాస్ అనే పౌరుడు బహిరంగ లేఖలో విద్యా వ్యవస్థ పతనానికి గల కారణాలను వివరించారు. అయ్యా ప్రవీణ్ ప్రకాష్‌గారు మీరు ఆంధ్రప్రదేశ్‌లోని విద్యావ్యవస్థ పతనానికి మూలకారణమైన ఏ ఒక్క అంశాన్ని కూడ ప్రస్తావించకుండా ఉపన్యాసం ముగించారు. 25 నిమిషాలు సాగిన మీ ఉపన్యాసంలో కేవలం రెండు అంశాలు మాత్రమే ప్రస్తావించారు. ఇందులో మొదటిది పదవతరగతి ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల మార్కుల మధ్య ఉన్న వ్యత్యాసం గురించి రెండవది సంవత్సరానికి రెండుసార్లు టీచర్లు విద్యార్థుల ఇళ్ళకు వెళ్లి వారి తల్లిదండ్రులతో సంభాషించడం. ఇందులో మీ ఉపన్యాసం ఆత్మ విమర్శ చేసుకోవడానికి ప్రాతిపదికగా తీసుకుంటున్నానని చెప్పారు. 1880 సంవత్సరంలో ఇంగ్లాడ్‌లో వలిలేసిన విధానాన్ని 140 సంవత్సరాల తరువాత 2024లో మన ప్రభుత్వం దాన్నే శిరోధార్యంగా భావిస్తుందనడం తప్పుకాదా? పబ్లిక్ పరీక్షల్లో అవకతవకలు జరుగుతున్నాయి. పబ్లిక్ పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్న పత్రాలు విద్యార్థుల యొక్క అభ్యసనస్థాయిలను పరీక్షించేవిగా కాకుండా ఇవి అత్యంత నాసిరకంగా 6,7 తరగతుల స్థాయిలను కూడ లేవనేది వాస్తవం కాదా? పరీక్షా గదుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల చేత పరీక్షలు రాయించడం సిగ్గుచేటు కాదా అని ప్రశ్నించారు. ఇంగ్లీషు సబ్జెక్టులో స్పెలింగ్ తప్పులు లేకపోయినా నాసిరకమైన నిబంధనలు పెట్టి విద్యాశాఖ సమాజాన్ని, తల్లిదండ్రులను మోసం చేస్తుంది కదా? ఇంతటి అవకతవకలున్న పబ్లిక్ పరీక్ష మార్కులను అధారంగా చేసుకొని బడుల పనితీరు విద్యార్థుల చదువుల్లో నాణ్యత పరీక్షించడం అన్యాయమైన అసంబద్ధమైన అనాలోచిత చర్య అని పేర్కొన్నారు. టీచర్లు విద్యార్థుల ఇళ్ళకు సంవత్సరానికి రెండుసార్లు వెళ్లి మాట్లాడడం అస్ట్రేయా, ఆమెరికా దేశంలో ఉన్న విధానం అమలు చేయడం భావ్యం కాదు. ఆ దేశాల్లో ప్రభుత్వ బడులలో జవాబుదారితనం ఉంది. ప్రతినెల బడిలో స్కూల్ ఇన్సఫక్షన్ జరిగి రిపోర్టు రాసి ఇస్తారు. అక్కడ పరీక్షల్లో కాపీయింగ్ విదానం ఉండదు. అధిక మార్కులు వేయడం జరగదు అని వివరణ ఇచ్చారు. తల్లిదండ్రులకు, సమాజానికి విద్యార్థుల వాస్తవాలు తెలుసు విద్యార్థుల ఇళ్లకు వెళ్లెడం కొంతమేర మాత్రమే సహాయపడుతుందన్నారు. మన రాష్ట్రంలో జవాబుదారితనం లేదు. ప్రైవేట్ బడులపై తల్లిదండ్రులకు నమ్మకం ఉండటానికి కీలకమైన సంస్కరణల గురించి మాట్లాడాలని హితబోద చేశారు. హోం విజిట్ చేస్తే పిల్లల చదువులో మార్పు వస్తుందని చెప్పడం తల్లిదండ్రులను పౌర సమాజాన్ని, రాజకీయ పార్టీలను తప్పుదోవ పట్టించడమేనని డా.గుంటుపల్లి శ్రీనివాస్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

# మున్సిపాల్టిలో చిరుద్యోగి చేతి వాటము

- రూ 64 వేలకుపైగా స్వాహా
- అలశ్యంగా గుర్తించిన అదికారులు
- సస్పెండు చేతులు దులుపుకున్న తీరు




**నంద్యాల, మే 22,ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల మున్సిపాల్టిలో ఏది చేసిన అంతా గోప్యముగా ఉంటుంది, ఎవరు ఏమి చేస్తున్నారో అంతా ఒక మాయగా ఉంటుంది.ఇక్కడ ఏది చేసిన ఒక సంచనముగా ఉంటుంది.ఇక్కడ రోజుకు ఒక సంచనము జరుగుతునే ఉంటుంది. మున్సిపాల్టిలో ప్రజలకు సంబందించి పన్నుల రూపములో వసూలు చేసిన డబ్బులను ఖజానాకు చెల్లించకుండా ఏకంగా 64వేలకు పైగా స్వాహా చేసిన కూడా దానిని అలశ్యంగా గుర్తించి అతనిని సస్పెండ్‌తో సరి పెట్టిన వైనము ఇది. నంద్యాల మున్సిపాల్టిలో అవినీతి తారా స్థాయికి చేరుకున్న అది చాలా గోప్యంగా ఉంటుంది. ఇక్కడ జరుగు తున్న తతంగము అంతా చాలా రహస్యంగా ఉంటుంది. ఇటీవల డంపింగ్ యాడులో ఒక కాంట్రాక్టరుకు నిర్వాకము వల్ల ప్రభుత్వానిక సంబందించిన అస్తులను పగులగొటిట్టప బయటి ప్రపంచానికి తేలియకుండా గోప్యంగా ఉంచారు. చివరికి స్వశానము గోడను పగలగొట్టడముతో ఎవరిక తెలియకుండా కాంట్రాక్టరుతో గోడను కట్టించారు. మున్సిపాల్టి ప్రజలపై పన్నుల బారము ఎంత పెంచిన వడ్డీ పడకుండా ప్రభుత్వం నిర్ణయించిన సమాయానికి పన్నులు కడుతున్నారు. ఈ పన్నులు వసూలు చేసే సిబ్బంది చేతి వాటము ప్రదర్శిస్తున్నా అదికారులు మాత్రము అలసత్వము ప్రదర్శిస్తు దానిని కూడా అలశ్యంగాగుర్తిస్తున్నారు.పొరపాటున ముందుగా గుర్తిస్తే వారికే ఇబ్బందేమో అని మిన్నకున్నారనే వాదనలు ఉన్నాయి. చిరుద్యోగి చేసిన తప్పుకు సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. వారిపై అజమాయిసీ చేసే అదికారులపై చర్యలు తీసుకోక పోవడము విశేషము యాదా రాజా తథాప్రజా అన్న చందనా అదికారులు తీరును బట్టి సిబ్బంది ప్రవరిస్తున్నారు. నంద్యాల పట్టణంలోని రో.గకుంట 39 వరాడ్డ సచివాలయంలో ఎడ్యుకేషన్ అండ్‌డేటా ప్రాసేసింగ్ సెక్రటరీ అబ్దుల్ రహిమాన్ పని చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 1నుంచి మే 16వరకు వివిద పన్నులకు సంబందించిరూ 221363 రూపాయలు ప్రజలకు రశీదులు ఇచ్చి సేకరించారు. ఈ మొత్తంలో ఒక 156651 రూపాయలు ప్రభుత్వ ఖజానీకు జమ చేశారు. మిగతా 64712 రూపాయలు జమ చేయలేదని అదికారులు గుర్తించారు. ప్రభుత్వం నిబందనల మేరకు వసూలు చేసిన డబుబ ఏ రోజుకు అ రోజు ప్రభుత్వానికి జమ చేయాల్సివుంది. వీరిపై ఉన్న అదికారులు రోజువారి సిబ్బందిజమ చేస్తున్నారా లేదా తెలుసుకోవాల్సిన అవసరము ఉంది ఈవిషయాన్ని అదికారులు పట్టించుకోక పోవడములో విఫలం అయ్యారు. ప్రభుత్వానిక ఆర్థికంగా నష్టము కల్పించారని యం.అబ్దుల్ రహీమన్‌ను ఎపిల సివిల సర్వీసెస్ రూల్స్ 1991 లోని రూల్ 8లోని సబ్ రూల్ 1 ఎపి మున్సిపల్స్ బార్టినేట్ సర్వీసు రూల్స్ 2019 యొక్క రూల్స్ 20ద్వారా అందించబడిన అదికారులను అమలు చేస్తు సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ అదికారులు ప్రెస్ నోట్ విడుదల చేశారు.

# పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు - జిల్లా కలెక్టరు

- ఆర్టీసి బస్సులు ఏర్పాటు - నిరంతరం విద్యుత్ సరఫరా
- పదవతరగతి, ఇంటర్ అడ్వాన్స్‌డు సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందిగా నిర్వహించండి - జిల్లా కలెక్టరు



**నంద్యాల విద్య, మే 22, ప్రభాతవార్తః** జిల్లాలో పదవతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డు సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు డా.కె శ్రీనివాసులు సంబంధిత అధికారులను అదేశించారు. బుధవారం కలెక్టరు ఛాంబర్‌లో సప్లవెంటరీ పరీక్షలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 24 నుంచి వచ్చేనెల 3 వరకు పదవతరగతి పరీక్షలు, ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, డిటిలను కేటాయించాలని డిఆర్వో పద్మజను అదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.రాగిరి వెంకటరమణను అదేశించారు. 10వ తరగతి పరీక్షలకు సంబంధించి 27 పరీక్షా కేంద్రాల్లో 7,748 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సంబంధించి 9,350 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం విద్యార్థులు 4,398 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, 2.30 నుంచి సాయంత్రం 5.30 వరుకు రెండవ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు వచ్చేందుకు ఆర్టీసి బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల్లోని నిరంతర ం విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని అదేశించారు. జిరాక్స్ మిషన్లను మూసివేయించాలని సూచించారు. సమావేశంలో డిఆర్వో ఏ పద్మజ, మున్సిపల్ కమిషనరు నిరంజన్‌రెడ్డి, డిఎంఅండ్‌హెచ్‌ఓ డా.రాగిరి వెంకటరమణ, డివిఈఓ సునీత, డిఇఓ సుధాకర్‌రెడ్డి, విద్యుత్, ఆర్టీసి, కార్మిక శాఖ అధికారులతో పాటు జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబరు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను జిల్లా కేంద్ర స్ట్రాంగ్‌రూంలలో భద్రపరచాలి



**కర్నూలు న్యూసిటి, మే 22, ప్రభాతవార్తః** రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను నియోజకవర్గం కేంద్రంలోని స్ట్రాంగ్ రూంలో కాకుండా జిల్లా కేంద్రంలోని ఈవిఎంలు భద్రపరిచన సెంటర్‌లో ప్రత్యేక స్ట్రాంగ్‌రూంలలో భద్రపరచాలని కర్నూలు జిల్లా టిడిపి అద్యక్షులు పి తిక్కారెడ్డి ఎన్నికల కమిషన్ వారికి, జిల్లా ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వర్‌యాదవ్ గార్లతో కలిసి నిర్వహించిన పత్రికా మీడియా ప్రతినిధుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని 7 అసెంబ్లీ, నియోజకవర్గాల్లో జరిగిన ఎంపీ,ఎమ్మెల్యే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను ఇప్పటివరకు ఆలూరు, ఆధోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఎమ్మిగనూరు, కర్నూలు, పత్తికొండ మొదలగు నియోజక కేంద్రాల్లో సబ్‌ట్రెజరీ కార్యాలయంలో స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. అయితే ఇక్కడ వాటికి సరైన భద్రత లేదన్న అనుమానాలు పోటీలో ఉన్న అభ్యర్థులు వ్యక్తపరచడం జరిగినందున పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో పూర్తిస్థాయి పోలీస్‌ల భద్రతతో సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు జిల్లా కేంద్రమైన కర్నూలు నగరంలోని స్ట్రాంగ్‌రూంలకు తరలించాలని వాటిని ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలలో కాకుండా ప్రత్యేక స్ట్రాంగ్‌రూంలో భద్రపరచాలని ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరుకు లేఖ ద్వారా కోరినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఈవిఎంలకు మూడంచల భద్రత ఉన్నకారణంగా ఇక్కడైతేనే భద్రత ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, ఎస్ ముంతాజ్, డి జేమ్స్, సత్రం రామకృష్ణుడు, ఎస్ షేక్షావలి, కార్పొరేటర్ రామాంజనేయులు, జూటూరు రవి, టి కృష్ణ, పి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టండి

- జిల్లా కలెక్టరు డా.కె శ్రీనివాసులు



**నంద్యాల, మే 22, ప్రభాతవార్త ప్రతినిధిః** నంద్యాల జిల్లా వ్యాప్తంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టెందుకు సబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టరు డా.కె శ్రీనివాసులు అదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ చైర్మన్ కలెక్టరు అధ్యక్షతన ఇసుక అక్రమాల తవ్వకాలపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లా పరిసర ప్రాంతాల్లో ఇసుక అ క్రమ తవ్వకాలను అరికట్టెందుకు గట్టి నిఘా ఉంచి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదేశించారు. అక్రమ ఇసుక రవాణా తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని సబ్‌డివిజనల్ పోలీస్ అధికారులను అదేశించారు. దిగువస్థాయి సిబ్బందికి అప్రమత్తం చేసి అ క్రమ రవాణాపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు, మండల తహశీల్దార్‌లు రెవిన్యూ అధికారులు పోలీస్ అధికారులచే ముమ్మర తనిఖీలు నిర్వహించి ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించేందుక ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకొని ఆ మేరకు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టరు అదేశించారు. పర్మిట్ లేని ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్‌లను సీజ్ చేసేందుకు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లకు అదేశాలు జారీచేయాలని ఉప రవాణా అధికారి కలెక్టరు అదేశించారు. రాత్రి సమయాల్లో నంద్యాల పట్టణ సమీపంలో కుందూనదిలో కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తవ్వకాలను జరుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టెందుకు అక్కడ పంచాయితీ కార్యదర్శులు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు అదేశాలు జారీచేయాలని కెసిసి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను కలెక్టరు అదేశించారు. ఈసమావేశంలో జిల్లా గనులు, మరియు భూ గర్భశాస్త్ర అధికారి రామచంద్ర, ఉపరవాణా అధికారి శివారెడ్డి, జిల్లా పంచాయితీ అధికారి మంజువాణి, భూగర్భ జల శాఖ ఉప సంచాలకులు రఘురాం, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెసరవాయి గ్రామంలో కార్డెన్ సెర్చ్...

- అనుమానిత ఇళ్లల్లో సోదాలు
- ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రతిఒక్కరూ సహకరించాలి
- సీఐ నల్లప్ప, ఎస్ఐ బి.టి.వెంకటసుబ్బయ్య



గడివేముల, మే22, ప్రభాతవార్త; మండలంలోని పెసరవాయి గ్రామంలో బుధవారంనాడు పాణ్యం సీఐ నల్లప్ప, గడివేముల ఎస్ఐ బి.టి.వెంకటసుబ్బయ్య పోలీసు సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నల్లప్ప, ఎస్ఐ బి.టి.వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీయస్పీ ఆధ్వర్యంలో పెసరవాయి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామంలోని అనుమానిత ఇళ్లలో సోదాలు నిర్వహించామన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ఈ సోదాలు నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలకు చోటునివ్వ కుండా ముందస్తుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఎవరై నా నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, ఎంతటివారైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నా రు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే మీ గ్రామంలో ఎవరైనా కొత్తవారు అనుమానస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే పోలీసు స్టేషన్‌కి లేదా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. వెంటనే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు శ్రీ విజయదుర్గాదేవి మహా రథోత్సవం

:- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు :- అన్ని ఏర్పాట్లు పూర్తి





**మంత్రాలయం,మే 22,ప్రభాతవార్త:** మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం,రచ్చుమర్రి గ్రామాల మధ్య వెలసిన శ్రీ విజయదుర్గాదేవి(మారెమ్మవ్వ) మహా రథోత్సవం అశేష భక్తులమధ్య నేడు జరుగనుంది.ఈ రథోత్సవంలో భాగంగా అమ్మవారికి ఉదయం నుండే పురోహితులు,పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.గంగపూజ,ప ంచామృతాభిషేకం,ఆకుపూజ, కుంకుమార్చన, మంగళ హారతి తదితర పూజలు నిర్వహిస్తారు.అదేవిధంగా శ్రీ సూక్త,దుర్గాసూక్త,దేవీసూక్త పూర్వక పూజలు,మహా నైవేద్యము,మహా మంగళ హారతి,భక్తులకు ప్రసాద వినియోగం,ప్రభావళి ఉత్సవము తదితర పూజలు నిర్వహిస్తారు.ఈ మహా రథోత్సవానికి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను మాధవ రం,రచ్చుమర్రి అమ్మవారి భక్తులు ఇప్పటికే పూర్తి చేశారు.ఈ మహా రథోత్సవంలో పాల్గొనే భక్తులకు ఉచిత అన్నదానం,తాగునీరు తదితర ఏర్పాట్లను చేశారు.ఈ మహోత్సవానికి స్థానిక భక్తులే కాకుండా పక్కనున్న తెలంగాణ,కర్ణాటకభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అశీర్వాదం పొందుతారు.

## గ్రామీణ ప్రాంతాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్

: ఐదు మోటర్‌సైకిల్ సీజ్ : రూరల్ సిఐ నాగభూషన్, అర్బన్ సిఐ లక్ష్మినారాయణ





**ఆత్మకూరు మే22,ప్రభాతవార్త:** ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామీణ ప్రాంతాలలో శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందని ఆత్మకూరు అర్బన్ సిఐ లక్ష్మినారాయణ, రూరల్ సిఐ నాగభూషన్‌లు పేర్కొన్నారు. మండల పరిధిలోని సిద్దాపురం గ్రామంలో నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి, ఆత్మకూరు డిఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలతో కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరిగింది. నాటుసారా, బెల్టుషాప్‌లు నిర్మూలనకై పోలీసుశాక ఉక్కుపాదం మోపుతుందని గ్రామస్తులకు తెలిపారు. అనుమానస్పదంగా ఉన్న రౌడిషీటర్‌ల ఇళ్ళపై పోలీసుశాఖ ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో నాటుసారా, బెల్టుషాప్‌లు గంజాయి ఇతర అసాంఘిక శక్తులకు కొమ్ముకాస్తూ శాంతి భద్రతాలకు విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. ప్రతి రోజు గ్రామీణ ప్రాంతాలలో కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రజా సమస్యలు ఏమైన ఉంటే నేరుగా పోలీసుల దృష్టికి తీసుకోని వస్తే ఆ సమస్యలను పరిష్కరించే విదంగా ముందుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో అభ్యర్థుల గెలుపు ఓటమిలపై బెట్టింగ్‌లకు పాల్పడితే ప్రత్యేక చర్యలు తీసుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నకిలి విత్తనాలు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తాం



**ఆత్మకూరు మే22,ప్రభాతవార్త:** ఖరీఫ్ సిజన్‌లో రైతన్నలు సాగు చేసుకుంటున్న విత్తనాలను నాణ్యత పరిణామాలతో విక్రయాలు జరపాలని ఆత్మకూరు వ్యవసాయశాఖ డివిజన్ సహాయ సంచాలకులు ఆంజనేయులు, మండల వ్యవసాయ శాఖ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుదవారం పట్టణంలోని పలు విత్తనాలు, పర్టిలైజర్ షాప్‌లను పరిశీలన చేసి రికార్డులను తనీఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ రైతులు సాగు చేసే విత్తనాలను అధిక ధరలకు అమ్మితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తప్పని సరిగ్గా కొన్న రషీదలు, రైతులకు ఇచ్చే విదంగా డీలరులు వ్యవహరించాలన్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తే అలాంటి డీలరులపై లైసెన్సు రద్దు చేస్తామని తెలిపారు. రికార్డులు పకడ్బందీగా ఉండే విదంగా చూసుకోవాలని సూచించారు. ఏదైన రైతులు నకిలి విత్తనాలు వచ్చాయని పిర్యాదు చేస్తే ఆ దుణాఖాల లైసెన్సులు రద్దు చేసే విదంగా వ్యవసాయశాఖ అధికారుల చట్టాలు ఉన్నాయని తెలియజేశారు.

## జగన్ మళ్లీ సిఎం కావాలని చండీయాగం



**కర్నూలు మున్సిపల్, మే 22, ప్రభాతవార్తః** వచ్చేనెల 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సిపి అభ్యర్థులు అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రిగా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్విజయంగా మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని అకాంక్షిస్తు ఈనెల 24న శ్రీరాజశ్యామల చండీయాగం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సిపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బివై రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న సకలవర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్న వైఎస్సార్‌సిపీ ప్రభుత్వం రావాల్సిన అవశ్యకత ఎంతో ఉందున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గణేష్‌నగరంలోని తన క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించే రాజశ్యామల చండీయాగానికి వైఎస్సార్‌సిపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ప్రజలు హాజరయి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## డ్రైవింగ్ లైసెన్స్‌లు ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రక్రియను తక్షణమే అపండి

**కర్నూలు మున్సిపల్, మే 22, ప్రభాతవార్తః** కేంద్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి ప్రైవేట్ సంస్థల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీచేసేలా నిబంధనలు తీసుకురావడం తక్షణమే నిలిపివేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధకృష్ణా డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు కర్షకభవన్‌లో అల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిఎస్ రాధకృష్ణా, ట్రాన్స్‌పోర్టు జిల్లా వర్కర్స్ ఫెడరేషన్‌జిల్లా ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్టీఏ కార్యాలయాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధంగా నిర్ణయాలు అమలుచేస్తుందని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే దశలవారిగా ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం కావాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.